

కుమరం భీం ప్రాజెక్టుపై పట్టింపేది?

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోనే పెద్దదైన కుమరం భీం ప్రాజెక్టు మనుగడకే ముప్పు కలుగుతున్నది. 45 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు 10 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్టు కట్ట మూడేళ్ల క్రితం పగుళ్లు తేలింది. నిధులు మంజూరు కాకపోవడంతో ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోవడం లేదు.

- మూడేళ్ల క్రితం ఆనకట్టకు పగుళ్లు
- కవర్లు కప్పిన అధికారులు
- నిధులు లేక మరమ్మతులకు నోచుకోని వైనం
- భారీ వర్షాలు కురిస్తే తప్పని ముప్పు
- ఆందోళనలో ఆయకట్టుదారులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బీడు భూములకు సాగు నీరందించాలనే లక్ష్యంతో ఆసిఫా బాద్ మండలం అడ పెద్దవాగుపై నిర్మించిన కుమ రంభీం ప్రాజెక్టు ప్రమాదపుటంచులో ఉంది. ప్రాజెక్టు ప్రారంభించి పుష్కర కాలం దాటినా నేటికి పంటలకు నీరందక పోవడంతో ఆయకట్టు దారులు తీవ్రంగా నష్టపోతు న్నారు. 2005లో 10 టీఎంసీల సామర్థ్యంతో 45వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే భావనతో రూ. 450 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టారు. 2011లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి పనులను ప్రారంభించారు. ప్రధాన కాలువలు పూర్తయినా వర్షాలకు పడిన గండ్లకు మరమతులు చేయక పోవడంతో చుక్కనీరు వదలక మూడేళ్లు దాటి పోయింది.

రైతులు కాలువలలో నిలువ ఉన్న నీటిని, సమీపంలోని వాగుల నుంచి ఆయిల్ ఇంజన్‌ల ద్వారా పంటలకు అందించుకుంటూ అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టు ఆనకట్ట దెబ్బతిని బలహీనంగా మారింది. నీటి తాకిడికి కుంగిపోయింది. ఆనకట్ట కుంగి మూడేళ్లు గడుస్తున్నా అధికారులు మరమతులు చేపట్టకుండా కట్టపై పాలిథీన్ కవర్లు కప్పించారు. ప్రాజెక్టు ఆనకట్ట దెబ్బతినడంతో 5.8 టీఎంసీలకు మించి నీటిని అధికారులు నిలువ చేయడం లేదు.

భారీ వర్షాలు కురిస్తే..

ఒక వేళ భారీ వర్షాలు కురిసి వరదనీరు చేరితే కట్టకు వేసి మట్టి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. జూలై 2022లో కురిసిన భారీ వర్షాలకు ఆనకట్ట దెబ్బ తిన్నది. నిర్మాణ సంస్థ ప్రాజెక్టు పనులను నాసిరకంగా చేపట్టడంతో భారీ వర్షాలకు ఆనకట్ట కుంగి బీటలు వారింది. వరద ఉధృతికి కుడివైపు చివరి భాగంలో 300 మీటర్ల మేర దెబ్బ తిన్నాయి. రాళ్లు, మట్టి కొట్టుకుపోయి బలహీనంగా మారింది. నీటి తాకిడికి ఆనకట్ట కుంగిపోయింది. దీంతో ఇంజనీరింగ్ అధికారులు పాలిథీన్ కవర్లు కప్పారు. మరమ్మతు పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

వరదనీరు చేరితే..

వరదనీరు వచ్చి ప్రాజెక్టులోకి చేరితే గండి పడకుండా గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. ఆసిఫాబాద్ మండలంలో కుడి కాలువ ద్వారా 6వేల ఎకరాలకు, ఎడమ కాలువ ద్వారా 39వేల ఎకరాలు ఆసిఫాబాద్ మండలంతో పాటు వాంకిడి, కాగజ్‌నగర్ మండలాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ప్రాజెక్టు నిలువ సామర్థ్యం తగ్గించడం, కాలువలు అధ్వానంగా మారడంతో పంట పొలాలకు సాగునీరు అందని పరిస్థితి నెల కొంది. ప్రాజెక్టులోని నీరు ప్రస్తుతం మిషన్ భగీ రథ నీటి సరఫరా, చేపల పెంపకం కోసం మాత్రమే ఉపయోగపడుతుంది.

మరమ్మతులకు ప్రతిపాదనలు..



గుణవంత్‌రావు, ఈఈ

ఆనకట్ట మరమ్మతు కోసం రూ. 15కోట్లు అంచనాతో ప్రతిపాదనలు పంపాం. తాత్కాలిక మరమ్మతుల కోసం రూ. 34 లక్షలు మంజూరయ్యాయి. వర్షా కాలం నేపథ్యంలో పనులు చేపట్టలేదు. అక్టోబరులో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం.

ఆరె కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చాలి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చింతలమానేపల్లి/కాగజ్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆరె కులస్తులను ఓబీసీలో జాబితాలో చేర్పించేలా చొరవ తీసుకోవాలని గురువారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఢిల్లీలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఆధ్వర్యంలో ఆరె సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 28 కులాలను ఓబీసీలో కలిపేందుకు కేబినెట్ ఆమోదం పొందేలా చొరవ తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, వెంకయ్య, దామోదర్, తుకారాం, దామోదర్, గణపతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీహెట్టిలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న సీఐ సంతోష్‌కుమార్

చింతలమానేపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలం లంబాడీహెట్టి గ్రామంలో గురువారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు సీఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గ్రామంలో తనిఖీలు చేపట్టి పత్రాలు లేని 27 వాహనాలు గుర్తించి జరిమానా విధించారు. రెండు వేల లీటర్ల బెల్లం పానకం, 20 లీటర్ల గుడుంబాను స్వాధీన చేకుని ఒకరిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీసు యాక్టు అమలు

ఆసిఫాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ప్రశాంతా వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి ఆగస్టు 1 నుంచి 31 వరకు జిల్లా అంతటా 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నా, బహిరంగ సభలు తదితర ప్రజలు గుమికూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయకూడదని చెప్పారు. నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి గొలిపే ఎటువంటి ఆయుధాలు కలిగి ఉండొద్దని తెలిపారు. ప్రజా జనజీవనానికి ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారి తీసే ఇబ్బందకర ప్రజా సమావేశాలు, జన సముహం, లౌడ్ స్పీకర్లు, డీజేలు నిషేధమని తెలిపారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

వాంకిడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై ప్రశాంత్ అన్నారు. గురువారం వాంకిడి మండలం నవ్యగూడ గ్రామంలో పోలీసు మిత్ర కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి, గుట్కా, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబండ గ్రామంలో సీఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘీక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా చూడాలని, కొత్త వ్యక్తులు, పరిచిత వ్యక్తులు వస్తే సహకరించవద్దని, గ్రామాల్లో గుడుంబా తదితరాలు నిషేధించాలని అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్య ఉన్నా పోలీసులను సంప్రదిం చాలన్నారు. ఆయన వెంట ఎస్సై కమలాకర్ తదితరులు ఉన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర వైద్య బృందం



వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

వాంకిడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రలోని ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం కేంద్ర వైద్య బృందం డాక్టర్ గైక్వాడ్ వరుణ్ నేతృత్వంలో సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, మందుల స్టోర్ గది, వార్డులు, ప్రయోగశాల, ప్రసవ గది తదితరాలను తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వైద్య సదుపాయాలు, రోజు వారిగా వస్తున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట వైద్యాధికారి రిషికా, డీపీఎంఓ శ్యాంలాల్, హెచ్‌ఈవో రవిదాస్ తదితరులు ఉన్నారు.

బీసీ సమాజ్ జిల్లా కన్వీనర్‌గా రమేశ్

కౌటాల, జూలై 31(ఆంధ్రజ్యోతి): బీసీ సమాజ్ జిల్లా కన్వీనర్‌గా కౌటాలకు చెందిన గడికందుల రమేశ్‌ను ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నియమించారు. ఈ మేరకు గురువారం మంచిర్యాలలో జరిగిన సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు.

నీటి గుంతల్లో బ్లీచింగ్



నీటి గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

సిర్పూర్(టి), జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలోని శివపూర్, షేక్మాద్‌గూడ, పాతట్లగూడ కాలనీల్లో ఈవో తిరుపతి ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య పనుల్లో భాగంగా మురికి కాలువలు, నీటి గుంతలలో బ్లీచింగ్ పౌడర్ చల్లించి, ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ప్రజలు పారిశుధ్య పనులకు సహకరించాలని కోరారు. ఇంటి ఆవరణలో చెత్తాచెదారం వేయకుండా సహకరించాలన్నారు.

నేరాలను నియంత్రించాలి



పోలీస్‌స్టేషన్ పరిసరాలు పరిశీలిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

కాగజ్‌నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నేరాలను నియంత్రణకు పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పెండింగ్ సమస్యలపై ఎస్‌హెచ్‌వోను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ రామానుజం, రూరల్ సీఐ కుమారస్వామి, ఎస్సై సందీప్ సిబ్బంది ఉన్నారు.

పోలీసులను నిర్భయంగా సంప్రదించాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలపై ర్యాగింగ్ ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులకు గురైనట్లయితే పోలీసులను నిర్భయంగా సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. స్థానికంగా గురువారం ఆయన మాట్లాడారు. భరోసా కేంద్రం ద్వారా జూలై నెలలో గ్రామాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు అవగాహన సదస్సులు కల్పించడంతో పాటు ఒక రేప్, ఒక పోక్సో కేసు, మూడు గృహాల పరిశీలించినట్లు తెలిపారు. మహిళలు, చిన్న పిల్లల రక్షణ కోసం, భరోసా సెంటర్‌లు పని చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయ పడోద్దని ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, షీ టీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్, భరోసా టీం తదితర సేవలపై అవగాహన కల్పించడానికి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా పిల్లలు, మహిళలు వేధింపులకు గురైనట్లయితే నేరుగా పోలీసును సంప్రదించాలని చెప్పారు. వివరాలను భరోసా సెంటర్ 8712670561 నంబరుకు తెలియజేయాలని సూచించారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

దహెగాం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండల కేంద్రంలో రెండు ట్రాక్టర్‌లను గురువారం ఆర్టీవో రాజమల్లు సీజ్ చేశారు. మండల కేంద్రానికి చెందిన పాలె ప్రకాష్ ఇసుక ట్రాక్టర్ పట్టుకుని సీజ్ చేయగా గుర్లె గోపాల్‌కు సంబంధించి ట్రాక్టర్ ట్రాలీని సీజ్ చేసినట్లు తెలిపారు. రెండు ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు ఆర్టీవో తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

బెజ్జూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌జీవో) ఇల్లా చైర్మన్ శ్యాంరావు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వివిధ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట సభ్యులు జనార్ధన్, తిరుపతి, మధుకర్, సంజు ఉన్నారు.

ఎస్పీని కలిసిన సీఐ

ఆసిఫాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నూతనంగా కౌటాల సీఐగా బాధ్యతలు చేపట్టిన సంతోష్‌కుమార్ గురువారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌ను మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్క అందజేశారు.

చారిటబుల్ ట్రస్ట్‌కు వితరణ

ఆసిఫాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎస్సై తుకారాం గురువారం రాంలీలా చారిటబుల్ ట్రస్ట్‌కు రూ.12 వేల విరాళంగా అందజేశారు. రాంలీలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సాయి లైఫ్‌లైన్ ఆసుపత్రిలో ప్రతి గురువారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులకు చేయూతనిచ్చేందుకు రిటైర్డ్ ఎస్సై విరాళంగా నగదును అందజేశారు.

సేవాలాల్ సేన నాయకుల ముందస్తు అరెస్టు



మాట్లాడుతున్న సేవాలాల్ సేన నాయకులు

కెరమెరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంత్రి వర్గంలో బంజార వర్గానికి చెందిన ఒక్క మంత్రి పదవి కూడా లేదని గురువారం గాంధీ భవన్ ముట్టడికి పిలునివ్వ డంతో ముందస్తుగా సేవాలాల్ సేనా నాయకులను పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు రూప్‌లాల్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో లంబాడీ సామాజిక వర్గానికి చెందిన ఒక ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని అలాగే త్వరలో గిరిజన యూనివర్సిటీ పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, చందు, సందీప్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు హెటీ, 11కేవీ, 33 కేవీ ఆపై లోట్ల్‌టేజీ సర్వీసుల మంజూరు వేగవంతం చేయడానికి సింగిల్ విండో వ్యవస్థ ఎంతగానో దోహదపడుతుందని ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాథోడ్ శేషారావు అన్నారు. స్థానికంగా ఆయన గురువారం మాట్లాడుతూ హెచ్‌టీ, 11 కేవీ, 33 కేవీ సర్వీసుల మంజూరుకు మరింత సరళీకృతం చేయడానికి హెచ్‌టీ మానిటర్ సెల్‌ను సర్కిల్ ఆఫీసర్, కార్పొరేట్ ఆఫీస్‌లలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా 11 కేవీలో వోల్టేజీ దరఖాస్తులను సర్కిల్ ఆఫీసర్ ఏడీఈ మానిటర్ చేస్తారని చెప్పారు. 33 కేవీ వోల్టేజీ దరఖాస్తులను ఏడీఈ కమర్షికల్ కార్పొరేట్ ఆఫీస్ అధికారి మానిటర్ చేస్తారని వివరించారు. ఈ సింగిల్ విండో విధానం వల్ల వినియోగదారులకు టీజీఎస్‌పీడీసీఎల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో హెచ్‌టీ దరఖాస్తులు నమోదు చేసుకొన్న తరువాత కొత్త అప్లికేషన్ ఉత్పన్నమవుతుందని తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏవో గిరీషన్

సిర్పూర్(టి), జూలై 31 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ఎరువులు దుకాణాలను గురువారం ఏవో గిరీషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ధరలను నోటీసు బోర్డుపై ప్రదర్శించాలని చెప్పారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని యజమానులను హెచ్చరించారు. రైతులకు ఎరువులు, విత్తనాలను అందించేటప్పుడు తప్పని సరిగా రశీదు ఇవ్వాలని ఈ సందర్భంగా ఏవో సూచించారు.

విద్యార్థులకు వ్యాయామ విద్య అవసరం



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమాధికారి రమాదేవి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ విద్యా విద్యార్థులకు ఎంతో అవసరమని గిరిజన సంక్షేమాధికారి రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలలో గురువారం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ప్రవర్తనలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలిపారు. సమావేశంలో ఏసీఎంవో ఉద్ధవ్, డీఎస్‌వో మీనారెడ్డి, జీసీడీవో శకుంతల, ఏటీడీవో చిరంజీవి, ప్రధానోపాధ్యాయులు జంగు, పేట సంఘం కార్యదర్శి కృష్ణమూర్తి, పీడీలు మధుసూదన్, షేకు, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో మెనూ పాటించాలి



కౌటాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

కౌటాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీలు సూచించారు. కౌటాల, సిర్పూర్(టి), కెరమెరి మండలాల్లో గురువారం ఎంపీడీవోలు పాఠశాలలను తనిఖీ చేశారు. కౌటాల మండలంలోని ముత్యం పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఎంపీడీవో ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనంను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా కష్ట పడి చదవాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు హనుమంతు, ఉపాధ్యాయులు ధర్మయ్య తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుడ్కిలి, జక్కాపూర్, మాకిడి, నవేగాం పాఠశాలలను గురువారం ఎంపీడీవో సత్యనారాయణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల, విద్యా ర్థుల హాజరు రిజిస్టర్‌లతో పాటు మధ్యాహ్న భోజనం ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రం లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఉన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి సూచనలు చేశారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోడాట్ ఆశ్రమ ఏయూపీఎస్ పాఠశాలను గురువారం ఎంపీడీవో అంజద్‌పాషా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా పాఠశాల విద్యార్థుల హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. పరిసరాలను, పాఠశాల ఆవరణలో ఉన్న వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యా హ్న భోజనం చేశారు. క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువతిని మోసగించిన ఒకరికి పదేళ్ల జైలు శిక్ష

ఆసిఫాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మభ్యపెట్టి లైంగికదాడికి పాల్పడి మోసగించిన కేసులో ఓ యువకుడి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.35 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి కుటుంబీకులతో పరిచయం ఉండడంతో అదే గ్రామానికి చెందిన మోహనంద్ సర్కార్ అనే వ్యక్తి వారి ఇంటికి వెళ్తేండేవాడు. కుటుంబ సభ్యులతో చనువుగా మాట్లాడుతుండే వాడు. ఆర్మీ ఉద్యోగం చేస్తున్న మోహనంద్ సర్కార్ 2019 జూన్ 30న సెలవుపై ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు ఆ యువతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. జూలై 4వ తేదీన యువతి ఇంటికి వస్తున్నానని సెల్‌ఫోన్‌కు మెస్సెజ్ పంపి వెళ్లాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్న అతడు యువతిని పెళ్లి చేసుకుంటానని మభ్యపెట్టి లైంగికదాడకి పాల్పడ్డాడు. ఈ విషయం ఆ యువతి తల్లిదండ్రులకు తెలిపింది. వెంటనే వారు మోహన్‌నంద్ సర్కార్ కుటుంబ సభ్యులను పలిపించి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. మోహనంద్ సర్కార్ కుటుంబ సభ్యులకు ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదనే కారణంతో అతడి వివరాలు చెప్పలేదు. దీంతో యువతి కుటుంబ సభ్యులు జూలై 30, 2019న ఈసుగాం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రాజేశ్వర్ కేసు నమోదు చేశారు. అనంతరం కేసు దర్యాప్తు చేసిన పోలీసులు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఎంవీ రమేశ్ పదేళ్ల జైలు శిక్ష, రూ. 35వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, సీఐ కుమారస్వామి, ఎస్సై కళ్యాణ్‌లను ఎస్పీ అభినందించారు.

పిచ్చి మొక్కలు లేకుండా చూడాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో అనిల్‌కుమార్

తాండూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రోడ్లకిరువైపులా పిచ్చి మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఎంపీవో అనిల్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని అచ్చలాపూర్ గ్రామంలో పర్యటించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. రిజిష్టర్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని పంచాయతీ కార్యదర్శి కల్పనకు సూచించారు. గ్రామంలోని రోడ్లను, మురికి కాలువలను శుభ్రం చేయాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని, దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. అనంతరం శ్మశాన వాటికను సందర్శించి పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని సూచించారు. నర్సరీని సందర్శించి గ్రామపంచాయతీ లక్ష్యం ప్రకారం మొక్కలు నాటాలని, మిగిలిన మొక్కలను నర్సరీల్లో సంరక్షించాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఆరె కులస్తుల సమస్య పరిష్కరించాలి

కాగజ్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆరె కులస్తుల సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కోరారు. ఢిల్లీలో గురువారం జరిగిన జాతీయ ఓబీసీ సెమినార్‌కు ఎమ్మెల్యే హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో ఆరె కులస్థులు రాష్ట్ర ఓబీసీ జాబితాతలో ఉన్నారని చెప్పారు. కాని కేంద్ర ఓబీసీ జాబితాలో లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో విద్య, ఉద్యోగ, రిజర్వేషన్ల విషయంలో ఇబ్బందులు తలెత్తున్నాయని చెప్పారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి రాందాస్ అలవలే, పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ నాయకుల వ్యాఖ్యలు సరికాదు'

కాగజ్‌నగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్‌ఎస్ నాయకుల వ్యాఖ్యలు సరికాదని టీడీపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్లమెంటు కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్ అన్నారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీమంత్రులు కేటీఆర్, హరీష్‌రావు పని కట్టుకొని బనకచర్ల విషయం లాగుతూ దుష్ప్రచారం చేస్తున్నారని, మానుకోవాలని ఆయన హితవు పలికారు.

ఫేస్ రికగ్నిషన్‌తో పింఛన్ల పంపిణీ



పింఛన్ల కోసం యాప్‌లో స్కాన్ చేస్తున్న పోస్టల్ సిబ్బంది

దండేపల్లి జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఒకరి బదులు మరొకరు పింఛన్లు తీసుకుంటూ అక్రమాలకు పాల్పపడడాన్ని నివారించడానికి అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు అందేలా నూతన టెక్నాలజీని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని బీపీఎం ద్వారా ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా పింఛన్‌దారుల ముఖచిత్రం యాప్‌లో కళ్లను స్కాన్ చేసిన తర్వాత పింఛన్‌దారులకు డబ్బులు చెల్లిస్తున్నారు. స్కాన్ చేసే క్రమంలో మూడుసార్లు ఐరిస్ రాకపోతే వేలి ముద్రల ద్వారా పింఛన్లను తపాలా సిబ్బంది చెల్లిస్తున్నారు.

అడుగుకో గుంత..

● అధ్వానంగా ఇందాని రోడ్డు ● రాకపోకలకు వాహనదారుల అవస్థలు



గుంతలు పడ్డ ఇందాని రోడ్డు

వాంకిడి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నంచి ఆరు కిలోమీటర్ల వరకు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనదారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చిన్న పాటి వర్షానికే రోడ్లన్నీ చిత్తడిగా మారి నడవడానికి సైతం వీలు లేకుండా పోతున్నాయి. దీంతో ప్రజలు తీవ్రఅవస్థలు పడుతున్నారు. మండ లంలోని ఇందాని రోడ్డుపై గుంతలు పడడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్రఅవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి ఇందాని పంచాయతీ కేంద్రానికి వెళ్లే రహదారిపై అడుకో గుంత ఏర్పడి అధ్వానంగా మారింది. జాతీయ రహదారి నంచి ఆరు కిలోమీటర్ల వరకు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. దీంతో వాహనదా రులు రాకపోకలకు తీవ్రఅవస్థలు పడాల్సిన పరి స్థితి నెలకొంది.

ప్రయాణం నరకం..

నిత్యం పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై ప్రయాణం నరకంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీళ్లు నిండి ఉండడంతో నీటి గుంతలో ద్విచక్ర వాహనం పడిప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఘా ట్‌జనగాంకు చెందిన సెండె సంతోష్ ద్విచక్రవాహనం పై వెళ్తుండగా గుంతను తప్పించబోయి పడిపో వడంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ దారిపై పలుమార్లు రోడ్డు ప్రమాదాలు జరిగి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. రోడ్డు మరమ్మతులు చేయాలని పలు మార్లు ఉన్నతాధికా రులకు వినతి పత్రాలు అందించినా స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన పాలకులు, ఉన్న తాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్డు..



జాతీయ రహదారి నుంచి ఇందాని గ్రామం వరకు రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గుంతలు పడడంతో వాహదారులు రాక పోలకు అవస్థలు పడుతున్నారు. గుంతలను తప్పిచబోయి ఇటీవల ఈ వ్యక్తి మృతి చెందాడు. పలువురు వాహనాలు అదుపుతప్పి పడిపోయి గాయపడ్డ ఘటనలు చోటు చేసుకున్నాయి. అధికా రులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టేం దుకు చర్యలు తీసుకోవాలి.

- దుర్గం దినకర్,
సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

జిల్లాలో ఇద్దరు సీఐల బదిలీ

ఆసిఫాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ గురువారం మల్టీ జోన్-1 ఐజీ ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులను జారీ చేశారు. ఆసిఫాబాద్ సీఐగా పని చేస్తున్న బుద్దె రవిందర్, రెబ్బెన సీఐగా పని చేస్తున్న బుద్దె స్వామిలను ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.. వరంగల్ సీసీఎస్‌లో పనిచేస్తున్న పి బాలాజీ వరప్రసాద్‌ను ఆసిఫాబాద్ సీఐగా, రామగుండం కమిషనరేట్ వీఆర్‌లో ఉన్న మారమూల సంజయ్‌ను రెబ్బెన సీఐగా బదిలీ చేస్తూ ఐజీ ఉత్తర్వులను వెలువరించారు.

నేడు ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడ్ స్కూల్‌లో యువ కబడ్డీ లీగ్ చాంపియన్ షిప్ పోటీలకు జిల్లా స్థాయి జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించనున్నామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ధర్మారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 3 నుంచి ఎల్బీ స్టేడియంలో నిర్వహించే యువత తెలంగాణ ప్రీమియం లీగ్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

సిర్పూర్(యు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు అందిస్తుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండలంలోని మహగాం రైతు వేదికలో సిర్పూర్(యు), లింగాపూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావుతో కలసి రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ రేషన్ కార్డుల పంపిణీ నిరంతర కొనసాగే ప్రక్రియ అన్నారు. కొత్త రేషన్‌కార్డులు రాలేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆహార భద్రత రేషన్ కార్డులు పంపిణీ చేస్తుందన్నారు. జిల్లాలో మొత్తం ఎనిమిది వేల మందికి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. లబ్ధిదారులు సన్నబియ్యం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్ రావు, తహసీల్దార్ ప్రహ్లాద్, సహకార సంఘం చైర్మన్ కేంద్రే శివాజీ, మాజీ సర్పంచులు ఆత్రం పద్మాబాయిరాజేశ్వర్‌రావు, ఆర్క నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ ప్రభుత్వ పరంగా రేషన్ కార్డులు మంజూరు చేసామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో గురువారం నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను కలెక్టర్ వెంకటేష్ దోత్రే, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జైనూర్ మండలంలో నూతనంగా 913 రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వాటిని ప్రజల సమక్షంలో పంపిణీ చేశామని వివరించారు. 1,595 మంది పేర్లు రేషన్ కార్డుల్లో చేర్చామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావ్, తహసీల్దార్ ఆడ బీర్షావ్, ఆర్ఐ మోహన్, నాయకులు మేస్రాం అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై అధ్యాపకులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కల్కెటర్ దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి రిజిస్టర్లు పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టిక, మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేసే విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో కళాశాల విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించడంతో పాటు నిష్ణాతులైన అధ్యాపకులతో విద్యాబోధన అందించాలని చెప్పారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కళాశాలలో చేయాల్సిన మరమ్మతులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఆర్ఆర్ కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని, వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి సభను విజయవంతం చేయాలి

దండేపల్లి జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆగస్టు 5న జరగనున్న బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు రానున్న నేపథ్యంలో సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు బందెల రవిగౌడ్ కోరారు. దండేపల్లిలో గురువారం పార్టీ కార్యాలయంలో నాయకులు, బూత్ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆగస్టు 5 లక్షెట్టిపేటలో శివాజీ చౌరస్తా నుంచి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీలో రాష్ట్ర అధ్యక్షుడు పాల్గొంటారన్నారు. ప్రతీ బూత్ నుంచి 100 మంది కార్యకర్తలు సమావేశానికి తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపతి రాజయ్య, రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి పత్తిపాక సంతోష్, నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, లక్ష్మణ్, రాకేష్, రవీందర్, మలయ్య, సత్తయ్య, సత్యనారాయణ, వెంకటేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ కసమల

లక్షెట్టిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదు వుకునే సమయం నుంచే పలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లక్షెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి సాయికిరణ్ కసమల అన్నారు. పట్టణంలోని వాగేశ్వర విద్యాసంస్థల్లో గురువారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని తెలిపారు. మహిళల రక్షణ, విద్యార్థినల రక్షణపై ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం న్యాయమూర్తిని కళాశాల యాజమాన్యం, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అప్పని లక్ష్మణ్, ఏజీపీ వెల్పుల సత్యం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెడ్డి సత్తన్న, ప్రధానకార్యదర్శి ప్రదీప్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు కిరణ్‌కుమార్, సురేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సుభాష్

ఆసిఫాబాద్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలిచి కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని ఏఐసీసీ కార్యదర్శి సుభాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాల యంలో గురువారం ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ కార్యక్రమంలో మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. వార్డు, గ్రామ స్థాయిలో బలోపేతంగా ఉంటేనే పార్టీ బలోపేతం అవుతుందని చెప్పారు. ఆ దిశగా కార్యకర్తలు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు గణపతి, బాలేష్, రామయ్య, ప్రకాష్ రావు, రమేష్, చరణ్, వసంత్‌రావు, మహేష్‌గౌడ్, మునీర్ అహ్మద్, గోపాల్‌నాయక్, శివ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని 9వ వార్డులో రోడ్డు నిర్మాణ పనులను జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, వార్డు ఇన్‌చార్జీ పెంట రజితరమేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సురేఖ మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడకుండా రోడ్ల నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కిషన్, మల్లేష్, స్వామి, అర్జున్, పోసన్న, కుమార్, మల్లేష్, నరేష్, గట్టేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులకు సేవలతోనే గుర్తింపు



చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తమ పదవి కాలంలో చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని ఇన్‌చార్జి జీఎం రాజేందర్ అన్నారు. ఏరియా ఇంజనీర్‌గా పనిచేసి రిటైర్ అయిన బి చంద్రశేఖర్‌రెడ్డిని ఇన్‌చార్జి జీఎం తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ, 37 ఏళ్ల 7 నెలల పాటు చంద్రశేఖర్ రెడ్డి సంస్థకు సేవలందించారని కొనియాడారు. ఆయన సింగరేణికి చేసిన సేవలు ఎన్నో ఉన్నాయని, ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, హరినారాయణ, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మీ, పర్చేజ్ అధికారి తదితరులు పాల్గొన్నారు. ఆర్‌కే న్యూటెక్ గనిలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ రామ్మోహన్ రావును ఎస్‌టీపీపీ డీజీఎం స్వామిరాజు, గని మేనేజర్ శ్రీనివాసులు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా సన్మానిం చారు. ఆర్‌కే 7 గనిలో మున్షి కనుకుంట్ల లక్ష్మణ్‌ను మేనేజర్ తిరుపతి సన్మానించారు. ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో పనిచేసి రిటైర్ అయిన నల్ల సంజీవరెడ్డిని నస్పూర్ రెడ్డి పరివార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘం గౌరవ అధ్యక్షులు కె. సురేందర్ రెడ్డి, హెచ్. వెంకటరెడ్డి, అధ్యక్షుడు మోతె రాఘవరెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి కాటం రాంరెడ్డి, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సింగరేణి అధికారికి సన్మానం

రెబ్బెన, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓపెన్‌కాస్టు పని పదవి విరమణ పొందిన సింగరేణి అధికారి మురహరి రావును సింగరేని కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షులు బయ్యె మొగిలి, శేషశైనా రావు, సభ్యులున్నారు. గోలేటిలో రిటైర్డ్ జీఎం రవి ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్ రావు, సెక్యూరిటీ అధికారి దాసరి శ్రీధర్‌ను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్ మాట్లాడుతూ గోలేటి అభివృద్ధికి సింగరేణి అధికారులు కృషి చేయాలని కోరారు.

పని చేసే ప్రాంతానికి దగ్గర నివాసం ఉండాలి

రెబ్బెన, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు వారు పని చేసే గనులు, డిపార్టుమెంటుల సమీపంలో నివాసం ఉండాలని ఎస్‌ఓటు జీఎం ఎస్.ఉమాకాంత్ తెలిపారు. గురువారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు నివాసం క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా విధుల్లోకి వచ్చిన ఉద్యోగులకు కౌన్సెలింగ్ ఎంపిక చేసుకున్న వారికి క్వార్టర్లను కేటాయించారు. ఎక్కువ దూరం ప్రయాణించి విధులకు హాజరు కావటం ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఉద్యోగులు పని ప్రదేశాలకు దగ్గరగా ఉంటే సమయం ఆదా కావటంతో పాటు కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీజీఎం(సివిల్) మదీనా భాషా పాల్గొన్నారు.

అడిషినల్ డీజీపీకి ఘన స్వాగతం


అడిషినల్ డీజీపీ అభిలాష్ బిస్త్‌కు మొక్కను అందజేస్తున్న డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్

నస్పూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించే పోలీస్ అధికారుల సమావేశంలో పాల్గొనేందుకు గురువారంరాత్రి నస్పూర్‌లోని సింగరేణి అతిథి గృహానికి చేరుకున్న అడిషినల్ డీజీపీ (ఆర్‌బీవీఆర్‌ఆర్ డైరెక్టర్) అభిలాష్ బిస్త్‌కు జిల్లా పోలీస్ అధికారులు ఘనస్వాగతం పలికారు. శుక్రవారం సమావేశం జరగనుంది. మంచిర్యాల డీసీపీ ఎ భాస్కర్, ఏసీపీ ఆర్ ప్రకాష్, రూరల్ సీఐ అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందించారు.

మొక్కలు నాటిన చిన్నారులు

నెన్నెల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని లోటస్ స్కూల్‌లో గురువారం గ్రీన్ డే నిర్వహించారు. పచ్చదనం పరిశుభ్రత గూర్చి పిల్లలకు వివరించారు. మొక్కలు నాటి సంరక్షించాలంటూ నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ రోడ్డుకు ఇరువైపులు చిన్నారులు మొక్కలు నాటారు. స్కూల్ కరస్పాండెంట్ మద్దెర్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కొండపర్తి వెంకటేశ్, టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజం

మంచిర్యాల క్రైమ్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ అనేది సహజమని మంచిర్యాల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎగ్గడి భాస్కర్ అన్నారు. గురువారం రామగుండం కమిషనరేట్‌కు చెందిన డీసీపీ అడ్మిన్ అశోక్‌కుమార్‌తో పాటు ఏఆర్ఎస్సై సమ్మయ్య పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల కోసం కృషిచేసిన డీసీపీ అడ్మిన్‌తో పాటు ఏఆర్ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఇరువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో 13 బెటాలియన్ కమాండెంట్ మూర్తి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఎఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు దామోదర్, మల్లేషం, శ్రీనివాస్, వామనమూర్తి పాల్గొన్నారు.

భూమిని కాపాడుకున్న గ్రామస్థులు

భీమారం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనపల్లిలోని భూమిని గ్రామస్థులు కాపాడుకున్నారు. మండలంలోని పోతనపల్లి గ్రామంలోని సర్వే నంబరు 312లోని 17 గుంటల భూమిని గురువారం మండల రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లారు. గతంలో ఇదే గ్రామానికి కమ్యూనిటీ హాలు, ఆలయాలకు ఈ భూమిని కేటాయించారని, ఈ భూమిలో ఏ ఇతర పనులు చేపట్టవద్దని రెవెన్యూ సిబ్బందికి గ్రామస్థులు తెలిపారు. తమకు అధికారులు పునరావాసం కింద భూమిని కేటాయించారని, ఇళ్ల నిర్మించుకోగా మిగిలిన భూమిని ప్రభుత్వ మిగులు భూమిగా కేటాయించిందన్నారు. మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఇటీవల చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తును పరిశీలించాలని తహసీల్దార్‌కు సూచించగా క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బందిని పరిశీలనకు పంపారు. ఈ విషయం తెలుసుకున్న గామస్థులు తమ గ్రామ అభివృద్ధి, అవసరాలకు మాత్రమే ఈ భూమిని కేటాయించారని, ఎవరికి ఇల్లు, ఇతర నిర్మాణాలకు అనుమతి ఇవ్వవద్దని అధికారులకు విన్నవించారు. ఈ విషయాన్ని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా తాను ఎవరికీ భూమిని కేటాయిస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ సదానందంను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మంత్రికి దరఖాస్తు పెట్టుకున్న పత్రంలోని భూమిని మాత్రమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామని, ఇప్పటి వరకు ఎవరికి భూమిని కేటాయించలేదని తెలిపారు. కాగా సోషల్ మీడియాలో మాత్రం భూమిని కాంగ్రెస్ నాయకులు కాజేస్తున్నారని చక్కర్లు కొట్టింది.

చోరీకి గురవుతున్న పంచాయతీ ట్రాక్టర్ల బ్యాటరీలు

కాసిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీకి గురికావడం కార్యదర్శులకు ఆందోళకు గురిచేస్తున్నది. ట్రాక్టర్లు ఊరి చివరిలో నిలిపి ఉంచంతో గుర్తుతెలియని వ్యక్తులు బ్యాటరీలను ఎత్తుకెళ్లడం సులభతరం అవుతోంది. ఇదివరకే ఐదు గ్రామ పంచాయతీల ట్రాక్టర్ల బ్యాటరీలను దొంగలు ఎత్తుకెళ్లారు. ట్రాక్టర్ల నిర్వహణ కార్యదర్శులకు కష్టంగా మారిన నేపథ్యంలో బ్యాటరీలు దొంగల పాలు కావడం కార్యదర్శులకు అదనపు బారంగా మారింది.

వైద్య శిబిరం

బెల్లంపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాల్‌లెక్స్‌లో గురువారం జిల్లా క్షయ నివారణ అధికారి సుధాకర్ నాయక్, మాజీ కౌన్సిలర్ నెల్లి రమేశ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యురాలు సుచరిత, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

బడి బ్యాగు మోయలేని భారం..

మీ పిల్లల పుస్తకాల బ్యాగు బరువు మీరెప్పుడైన చూశారా.... ఇటీవల ఏమైన వెన్నునొప్పి వస్తుందని ఫిర్యాదు చేశారా అలా చెబితే సాధారణనొప్పిగా భావించి తేలికగా తీసుకోకండి. రాబోయే రోజుల్లో అదే పెద్ద సమస్యగా మారవచ్చు. తల్లిదండ్రులు ఉదయం గడియారంలో ఎనిమిది అయిందంటే విద్యార్థులు బ్యాగును భుజానవేసుకొని భారంగా నడవడం మనం రోజూ చూస్తూనే ఉంటాం. మెడ వంగిపోతుందా ఏంటి అనేంత బరువు ఉంటుంది ఆ పుస్తకాల సంచి బరువు. పిల్లల బ్యాగ్ బరువుతో ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం పాఠశాల పుస్తకాల బరువు తగ్గించడానికి చర్యలు తీసుకుంటుంది.

- మంచిర్యాల క్రైం



● ఆహార అలవాట్లలో మార్పులతో..

ఆధునిక కాలంలో ఆహారపు అలవాట్లు పలు మార్పులకుచోటు చేసుకుంటున్నాయి. దీనికి ముఖ్య కారణం డిఫ్రైడ్ ఫుడ్‌చేసే పూరి, మ్యాగీ వంటి ఆహారం తీసుకోవడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ పెరిగి విద్యార్థులు చిన్న వయస్సులోనే అధికబరువు పెరుగుతున్నారు. పిల్లల గారాభంతో తల్లిదండ్రులు సైతం అలాం టి ఫుడ్ ఇవ్వడం వల్ల అజీర్ణం, గుండెకు సంబంధించిన వ్యాధులు ఎక్కువగా వస్తున్నా యని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- ● బ్యాగుల అధిక బరువుతో పిల్లల ఆరోగ్యంపై ప్రభావం
- ● చదువుతోనే సరి.. ఆటలకు చోటేది

బ్యాగ్ బరువు ఎంత ఉండాలి...

బడిపిల్లల పుస్తకాలు బరువు వారి తరగతిని బట్టి మారుతుంటోంది. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల పుస్తకాల బరువు 12 నుంచి 17 కిలోల వరకు ఉంటుందని తెలంగాణ విద్యాశాఖ క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. పిల్లల శరీరబరువులో బ్యాగు బరువు పదిశాతం కంటే ఎక్కువగా ఉండ వద్దనే విషయంపై విద్యావేత్తలు, వైద్యులు చెబుతు న్నారు ప్రభుత్వాలు నియమిస్తున్న విద్యాకమిటీల మేరకు ప్రతి పాదనలు చేసినా ఆచరణలో మాత్రం సాధ్యపడడం లేదు. ఏటా పాఠశాలల ప్రారంభంలో కొద్దిరోజులు దీనిపై చర్చ జరిగినప్పుడు ఫలితం ఉండడం లేదని విద్యా నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోయలేని భారాన్ని పాఠశాలలు మోపు తున్నప్పటికీ దీనిపై ఎవరూ స్పందించడం లేదు. స్థాయిని మించి బరువును మోయడంతో పిల్లల మెడ, వెన్ను ముఖ, భుజాల పై తీవ్ర ప్రభావం చూపడంవల్ల విద్యార్థులు అనా రోగ్యానికి గురవుతున్నారని పలు విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ పుస్తకాలతో పాటు సొంతంగా టెక్నో తదితర అంశాలు జతచేస్తూ పుస్తకాల బరువును పెంచేస్తున్నారు.

తల్లిదండ్రులదీ ఇదే తీరు...

ఎక్కువగా పుస్తకాలు ఇచ్చే పాఠశాలల్లోనే చదువు బాగా చెబుతారని పిల్లల తల్లిదండ్రులు నమ్మడంతోనే ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయి. అడ్మిషన్ తీసు కునేముందు ఒక్కో సబ్జెక్టుకు ఎన్ని పుస్తకాలు ఇస్తారు. అదనపు యాక్టివిటి పుస్తకాలు ఏమైన ఇస్తున్నారా అని ముందుగా విచారణ చేస్తున్నారు. ఖర్చు ఎంతైన పర్వాలేదు పుస్తకాల లెక్కతగ్గకూడదనే దోరణీలో తల్లిదండ్రులు వ్యవహరిస్తున్నారు.

ఆడుకొనే జాగ లేదు.. జాగ ఉంటే ఆడించేవారు లేరు..

చదువుతోపాటు ఆటలకు ప్రాముఖ్యం ఇవ్వాలి. అప్పుడే పిల్లలు శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. ఫిజికల్, మెంటల్ ఫిట్‌నెస్‌కోసం పిల్లలను ఆటలవైపు ఎంకరేజ్ చేయాలి. పాఠశాలల్లో కనీసం ప్లే గ్రౌండ్ కూడా లేకుండాపోయాయి. దీంతో బుక్స్‌తోనే కుస్తీపడుతున్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆట స్థలాలే కరువయ్యాయి. స్కూల్‌లో మైదానాలు లేవు. మైదానాలు ఉన్న చోట పీఈటీలు లేరు. దీంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. యామాన్యానికి ఎప్పుడు చూసినా చదువు, ర్యాంక్‌ల ధ్యాస తప్ప ఆడించాలనే కనీస ఆలోచన కూడా లేకుండాపోయింది. మార్నింగ్ ప్రేయర్ నిర్వహించడానికి కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. మైదానంలో బస్సులను పార్కింగ్ చేయడానికి వినియోగిస్తున్నారు.

● సెల్‌ఫోన్‌తో అనర్థాలు..

విద్యార్థులు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌కు ప్రభుత్వం గాని పాఠశాలలు గాని కనీసం పేరెంట్స్ కూడా పట్టించుకపోవడంతో పిల్లలు ఆటలకు దూరమవుతున్నారు. స్కూల్ నుంచి ఇళ్లకు వచ్చిన తరువాత పుస్తకాలతోనే కుస్తీపడుతున్నారు. హోంవర్కు పూర్తి కాగానే టీవీలకు అతుక్కుపోతున్నారు. తల్లిదండ్రులు అల్లరి చేస్తున్నారని పిల్లల చేతికి సెల్‌ఫోన్స్ ఇచ్చి తమ పనుల్లో నిమగ్నమవుతున్నారు. పాఠశాలల్లో ప్లేగ్రౌండ్ లేక ఆటలకు దూరమైతే ఇంటి వద్ద కూడ అదే పరిస్థితి. కనీసం ఇరుగు పొరుగు పిల్లలతో కూడ ఆడలేని పరిస్థితి నెలకొంది. దీనికి కారణం సెల్‌ఫోన్‌లకు బానిస అవడమే అని మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలపై శ్రద్ధ వహించాలి...



విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ద వహించాలి. ము ఖ్యంగా పిల్లల స్టడి బ్యాగ్ తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఎక్కువ బరువు మోయడం వల్ల మెడలు, కండరాలు, నడుముపై ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. దాంతో పిల్లలు మానసికంగా కుంగిపోతారు. పిల్లలు స్కూలు నుంచి వచ్చిన తరువాత ఆడుకునేలా చూడాలి.

- డాక్టర్. సురేశ్‌కుమార్

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సెవెన్‌హిల్స్ హైస్కూల్‌లో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ముంబాయి నుంచి వచ్చిన ఆయుర్వేద వైద్యుడు రామేశ్వర్‌రావు మానే 60 మందికి పరీక్షలు చేసి మందులను అందజేశారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా శిబిరం ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వహకుడు గోనే శ్యాంసుందర్‌రావు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కోటపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో కోటపల్లి మండల సమాఖ్య కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు కార్యనిర్వహణ అధికారి సుసర్ల రాజేష్ మహిళలకు కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ద్వారా అందించే ఆర్థిక భద్రత, భీమా, పెన్షన్ పథకాలపై అవగాహన కల్పించారు. గత మార్చి నెలలో మరణించిన పాయిరాల మల్లయ్యకు జీవన్ సురక్ష బీమా పథకం ద్వారా వచ్చిన రెండు లక్షల రూపాయల విలువైన చెక్కును అతని భార్య ఎల్లక్కకు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్‌సీ ప్రేమ్‌రావు, ఏపీఎం వెంకటేష్, మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిన నాయకులు

భీమారం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన నంగారా బేరి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర స్థాయి సమావేశానికి గురువారం సమితి నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. జిల్లా అధ్యక్షుడు భుక్య రాజ్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో నాయకులు రాజేష్‌నాయక్, రవి నాయక్, శ్రీనివాస్, బలరాం, శ్రీనివాస్, విజయరాజ్, ప్రవీణ్, పున్నంనాయక్, బాపు నాయక్, నవీన్‌నాయక్, తరలివెళ్లారు.

ఏపీఎంకు సన్మానం

కాసిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ లో ఏపీఎంగా విధులు నిర్వహించిన వెంక టేశ్వర్లు హాజీపూర్‌కు బదిలీపై వెళ్తుండడంతో ఆయనను గురువారం కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులు సన్మానించారు. తెలుగుతల్లి మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీని సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రిరూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ఐటీఐ పరిధిలో ఏర్పాటు చేసిన ఏటీసీలో విద్యార్థులు అడ్మిషన్‌లు పొంది సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సతీష్‌కుమార్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ దేవానంద్ పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏటీసీ పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఏటీసీలను ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో అడ్మిషన్‌లు పొంది నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

మంచిర్యాల క్రైమ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని రంగపేటలో పలు అభివృద్ధి పనులకు మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్ గురువారం భూమిపూజ చేశారు. డీఎంఎఫ్‌టీ నిధులు 18లక్షల రూపాయలతో వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

పుట్టగొడుగుల్లా హాస్టళ్లు

- కనీస పర్యవేక్షణ కరువు
- ప్రైవేటు విద్యాసంస్థలకు అనుబంధంగా ఏర్పాటు

(5వ పేజీ తరువాయి)

అధికారుల నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్‌వోసీ) పొందాల్సి ఉంటుంది. దాంతోపాటు అగ్నిమాపకశాఖ అనుమతులు కూడా తీసుకోవాలి. అవే నిబంధనలు హాస్టళ్లకు కూడా వర్తిస్తాయి. ఎన్‌వోసీలు కేవలం విద్యాసంస్థల పర్మిషన్ సమయంలో తయారుచేస్తున్న ఫైళ్లకు మాత్రమే పరిమితం అవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్‌వోసీలు జారీచేస్తున్న సంబంధిత అధికారులు ఆతరువాత పర్యవేక్షణ జరపకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ ఇష్టారీతిన సాగుతోంది. ప్రైవేటు పాఠశాలలు, కళాశాల్లో ఉన్న హాస్టళ్లలో తనిఖీలు చేసేవారు లేకపోవడం గమనార్హం.

● రక్షణ చర్యలు కరువు...

ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న హాస్టళ్లలో కనీస రక్షణ చర్యలు పాటించడంలేదు. ఇరుకు గదుల్లో విద్యార్థులను కుక్కుతున్నా పట్టించుకునేవారు లేరు. ఒక్కో గదిలో కనీసం పదిమంది వరకు విద్యార్థులకు వసతి కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. ధనార్జనే ధ్యేయంగా వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్న యాజమాన్యాలకు వారి బాగోగులే అవసరం లేకుండా పోయాయి.

మూడు నాలుగు అంతుస్తుల్లో హాస్టళ్ల ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు కనీసం లిఫ్ట్ సౌకర్యం కూడా కల్పించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. అగ్నిప్రమాదాలు సంభవించిన పక్షంలో భవనం చుట్టూ ఫైరింజన్ తిరిగేలా ఏర్పాట్లు ఉండాలి. జిల్లావ్యాప్తంగా 30 నుంచి 40 హాస్టళ్లు ఉండగా, ఎక్కడా ఆ వెసులుబాటు లేదు.

దీంతో ప్రమాదం జరిగితే తల్లిదండ్రులు భారీమూల్యం చెల్లించుకోకతప్పదు. హాస్టళ్లలో కిటికీలకు గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. రెండురోజుల క్రితం జిల్లా కేంద్రంలో ఇంటర్ విద్యార్థిని హాస్టల్ నుంచి పడిపోయిన సంఘటనలో కిటికీకి గ్రిల్స్ లేకపోవడం గమనార్హం.

హాస్టళ్ల పర్యవేక్షణ మా పరిధి కాదు..

- డీఈవో యాదయ్య



ప్రైవేటు విద్యాసంస్థలకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న హాస్టళ్ల పర్యవేక్షణ బాధ్యత మాదికాదు. కేవలం పాఠశాలల నిర్వహణ పర్యవేక్షణ మాత్రమే మాపై ఉంటుంది. ప్రైవేటు హాస్టళ్లలో విద్యార్థులను చేర్పించడం వారి తల్లిదండ్రుల నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. అయితే ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్ల పర్యవేక్షణ బాధ్యత మేమే వహిస్తాం.

అధికారులు పర్యవేక్షించాలి..

డి శ్రీకాంత్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల్లో ప్రారంభ సమయంలో ఎన్‌వోసీలు జారీచేస్తున్న మున్సిపల్, పంచాయతీ అధికారులే పర్యవేక్షణ జరపాలి. కేవలం సర్టిఫికెట్ జారీతోనే సరిపెట్టకుండా నిర్వహణపై కూడా వారు దృష్టిసారిస్తే విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తారు. కలెక్టర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు ప్రైవేటు హాస్టళ్లను పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. అనుమతులు లేని హాస్టళ్ల నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకోవాలి.

మానసిక ఆరోగ్యాన్ని పటిష్టం చేయడమే లక్ష్యం

జైపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు మాన్ ద్వారా మానసిక ఆరోగ్యానికి బలం పెరుగుతుందని సీఐఎస్ఎఫ్ కమాండెంట్ చెంచల్ సర్కార్ పేర్కొన్నారు. గురువారం జైపూర్‌లోని ఎస్టీపీపీ సీఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్టు సహకారంతో నడుస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు 75 వేల మందికి పైగా సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు మానసిక ఆరోగ్యపరంగా సహాయం అందించామని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల్లో సీఐఎస్ఎఫ్‌లో ఆత్మహత్యల రేటు 40 శాతం మేర తగ్గిందన్నారు. మానసిక ఆరోగ్యాన్ని పటిష్టం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు కేటాయించండి

భీమారం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాజీపల్లి గ్రామానికి చెందిన జాడి రాజలింగు, దుర్గం రాజేష్, జనార్ధన్, లక్ష్మీతో పాటు పలువురు గురువారం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ తాము అత్యంత పేదలమని, తమకు ఉండడానికి ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామ నాయకుల అండతో అధికారులు అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజలింగు, శశిధర్, లక్ష్మి పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం

జైపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తించిన డిప్యూటి సూపరింటెండెంట్ చుక్కాల శ్రీనివాస్ పదవీ విరమణ పొందగా ఎస్టీపీపీ పరిపాలన భవనంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు సముద్రాల శ్రీనివాస్, మురళీధర్, మదన్ మోహన్, అజాజుల్లాఖాన్, కిరణ్ బాబు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ముఖం చూపిస్తేనే ఇక హాజరు

- నేటి నుంచి ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు

కోటపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇక ముఖం చూపిస్తేనే ఉపాధ్యాయులకు పాఠశాలల్లో హాజరు పడనుంది. శుక్రవారం నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ముఖ గుర్తింపు హాజరు (ఎఫ్ఆర్ఎస్) అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్‌లు, జనరల్ గురుకులాల్లో ఉపాధ్యాయులకు ఇది వర్తించనుంది. వీరందరికి ముఖ గుర్తింపు హాజరు అమలు చేసేందుకు ఇప్పటికే విధివిధానాలు ఖరారు కాగా శుక్రవారం నుంచి ఇది అమలు కానుంది. గత ఏడాది ఫిబ్రవరి నుంచి పెద్దపల్లి జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తుండగా రాష్ట్రవ్యాప్తంగా దీనిని విస్తరించేందుకు విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. డీఎస్ ఈ-ఎఫ్ ఆర్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని దీని ద్వారానే ముఖ గుర్తింపు హాజరు పడుతుందని విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే విద్యార్థుల అటెండెన్స్ ఎఫ్ఆర్ఎస్ విధానం ద్వారా అమలవుతుండగా తాజాగా ఇది ఉపాధ్యాయులకు వర్తించనుంది.



-దుమ్మా ఉపాధ్యాయులకు అడ్డుకట్ట

ముఖ గుర్తింపు విధానం అమలులోకి రానుండడంతో దుమ్మా కొట్టే ఉపాధ్యాయులకు ఇది అడ్డుకట్టవేయనుంది. మారుమూల మండలంలోని దూర ప్రాంత గ్రామాల్లో విధులు నిర్వహించే ఉపా ధ్యాయులు దుమ్మా కొడుతున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. కొన్ని చోట్ల వంతులవారీగా ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో ముఖ గుర్తింపు విధానం అమ లులోకి రానుండడంతో ఇలాంటి ఉపా ధ్యాయులకు అడ్డుకట్ట పడనుంది. పాఠశాల సమయానికి ఉపాధ్యాయులు హాజరైతేనే ముఖగుర్తింపు పనిచేయనుంది. ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయులకు హాజరు నమోదు కాదు. దీంతో ఉపాధ్యాయుల దుమ్మాకు బ్రేక్ పడే అవకాశాలు ఉన్నాయి.

విద్యతోనే ఉన్నత భవిష్యత్

దండేపల్లి జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంత్రి రాజు అన్నారు. గురువారం దండేపల్లి మండలం రెబ్బనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో తెన్నేటి అవార్డ్ ఫర్ ఎక్స్‌లెన్స్ పేరుతో మెరిట్ అవార్డ్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం గత ఏడాది పాఠశాలో నిర్వహించిన ప్రతిభ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తరగతుల వారీగా నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎండీ శరఫోద్దీన్ పాల్గొన్నారు.

'పారాక్వాట్'పై అవగాహన

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పారాక్వాట్(గడ్డి మందు)పై కరీంనగర్‌లో కలెక్టర్ పమెలా సత్పతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పారాక్వాట్ విషప్రయోగాల నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో టీజీఎంసీఈసీ సభ్యుడు రాజ్‌కుమార్, డాక్టర్ రాకేష్, సతీష్, అనిల్, మంచిర్యాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ప్రిన్సిపాల్‌కు సన్మానం

మంచిర్యాల క్రైమ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన వంగ చక్రపాణి గురువారం పదవి విరమణ పొందారు. పదవీ విరమణ పొందిన ప్రిన్సిపల్‌ను కళాశాల అధ్యాపకులు సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేట ప్రిన్సిపల్స్ నరేందర్‌రెడ్డి, కాంపెల్లి శంకర్, పట్వర్ధన్, మహాత్మ సంతోష్ పాల్గొన్నారు.

కన్నెపల్లి: కన్నెపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సువర్ణ ఉద్యోగ విరమణ పొందగా గురువారం పాఠశాలలో సన్మానించారు. హెచ్ఎం కజ్జం రమేష్, ఎంఈవో రాములు హాజరై సువర్ణ చేసిన విద్యా సేవలను కొనియాడారు. మాజీ జడ్పీటీసీ కౌటారపు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఉద్యోగుల సంఘం నాయకులు

జైపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15లోగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై పలుమార్లు విన్నవించినప్పటికీ మంత్రులు, అధికారుల కమిటీల పేరుతో కాలయాపన జరుగుతుందే తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే నిరసన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. జిల్లా ఉద్యోగులు ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా టీజీఈజేఏసీ చైర్మన్ గడియారం శ్రీహరి, జనరల్ సెక్రటరీ వనజారెడ్డి, డిప్యూటి చైర్మన్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్


ఫార్మసీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్

లక్సెట్టిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ సూచించారు. లక్సెట్టిపేట మండలం వెంకట్రావుపేట పాథమిక ఆరోగ్య కేంద్రంను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు ల్యాబ్, ఫార్మసీని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని సూపర్‌వైజర్‌లు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. సూపర్‌వైజర్లు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో పర్యటిస్తున్న విషయాలను వెంట వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. సూపర్‌వైజర్‌లు ఆరోగ్య ఉప కేంద్రాల్లో, ఆయుస్మాన్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని తమ పరిధిలోని గర్భిణుల ఈటీడీ వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో వెంట జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఘనంగా మున్షి ప్రేమ్‌చంద్ జయంతి

కోటపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రచయిత మున్షి ప్రేమ్‌చంద్ జయంతి వేడుకలను గురువారం మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ రాజశేఖర్, హిందీ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారత సాహిత్యంలో ప్రేమ్‌చంద్ ఎంతో కృషి చేశారని, పేదిరకం, సామాజిక సమస్యలు , కుల వివక్ష వంటి అంశాలపై ఆయన రచనలు చేశారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మున్షి ప్రేమ్‌చందర్ రచనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు సలీం, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల విద్యాధికారిగా దత్తుకుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈవో


చెన్నూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు మండలం కిష్టంపేట జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న దత్తుకుమార్‌ను చెన్నూరు మండల ఇన్‌చార్జీ విద్యాధికారిగా నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న రాధాకృష్ణమూర్తి ఇన్‌చార్జీ మండల విద్యాధికారిగా విధులు నిర్వహించారు. ఆయన స్థానంలో దత్తుకుమార్‌ను నియమించారు. ఈమేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు.

పంటల పరిశీలన

తాండూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చౌటపల్లి, తాండూర్ గ్రామాల్లోని వరి, పెసర పంటలను గురువారం మండల వ్యవసాయాధికారిణి సుష్మ పరిశీలించారు. చీడ పీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. నాణ్యమైన విత్తనం రైతు నేస్తం కార్యక్రమంలోభాగంగా రైతులకు వరి, పెసర విత్తనాలు సరఫరా చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు శంకర్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్‌ను సీజ్ చేయండి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని కాలేజీ రోడ్డులో గల జుపిటర్స్ నవోదయ సైనిక్ కోచింగ్ సెంటర్‌ను సీజ్ చేయాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రవీణ్‌కుమార్, రాజేష్, సంజయ్‌కుమార్ అగ్నిమాపకశాఖ, నగరపాలక సంస్థ, కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు గురువారం వినతిపత్రాలు అందించారు. ఎలాంటి అనుమతులు లేకుండా కనీస సౌకర్యాలు లేకుండా కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారని తెలిపారు. భవనం సరిగ్గా లేదని, ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.



పుట్ట గొడుగుల్లా హాస్టళ్లు

- కనీస పర్యవేక్షణ కరువు
- ప్రైవేటు విద్యాసంస్థలకు అనుబంధంగా ఏర్పాటు
- వసతి పేరుతో విద్యార్థుల నుంచి అడ్డగోలు వసూళ్లు
- పర్యవేక్షణ అధికారం తమకు లేదంటున్న విద్యాశాఖ అధికారులు
- కనీస సౌకర్యాలు లేక విద్యార్థుల అవస్థలు

మంచిర్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్ల నిర్వహణ నేటిరోజుల్లో లాభసాటి వ్యాపారంగా మారింది. విద్యాసంస్థలకు అనుగుణంగానేగాక వర్కింగ్ మెన్, ఉమెన్‌హాస్టళ్ల పేరుతో కుప్పలుతెప్పలుగా వసతి గృహాలు పుట్టుకొస్తున్నాయి. హాస్టళ్ల ఏర్పాటు, నిర్వహణపై పర్యవేక్షణకు ప్రత్యేకంగా ప్రభుత్వపరంగా ఓ శాఖ అంటూ లేకపోవడంతో నిర్వాహకులకు ఆడిందే ఆటగా తయారైంది. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీల్లో నిర్వహిస్తున్న హాస్టళ్ల పర్యవేక్షణ బాధ్యత పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ అధికారులపై ఉంటుంది. ఆయా హాస్టళ్లపై అవసరమైతే కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల అజమాయిషీ కూడా ఉంటుంది. దీంతో మెనూ, ఇతరసౌకర్యాల కల్పనపై అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటారు. అదే ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు అనుబంధంగా ఏర్పాటవుతున్న హాస్టళ్లలో పర్యవేక్షణ బాధ్యతలు అటు విద్యాశాఖకుగానీ, ఇంటర్మీడియట్ అధికారులకుగాని లేవు. దీంతో అరకొర సౌకర్యాల మధ్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

● ధనార్జనే ధ్యేయంగా....

జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం నడుస్తున్న హాస్టళ్లలో నిర్వాహకులు కేవలం ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. హాస్టళ్ల పేరిట వేలకువేలు ఫీజులు దోచుకుంటున్నా అడిగేవారు లేరు. అడ్మిషన్ల సమయంలో చెప్పిన విధంగా ఎక్కడా మెనూ పాటించడం లేదని, ఇతర సౌకర్యాలు కల్పించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎక్కడ చూసినా దాదాపుగా అనుబంధ హాస్టళ్లు ఏర్పాటు అవుతున్నాయి. ఇంటిపట్టున ఉంటే చదువుపై ఆసక్తి ఉండదనే ఉద్దేశంతో హాస్టళ్లు ఉన్న స్కూళ్లు, కాలేజీల వైపు మొగ్గు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఫీజుల విషయం ఆలోచించకుండా తమ పిల్లలను హాస్టళ్లలో చేర్పిస్తున్నారు. అయితే పోషకుల అవసరాన్ని అవకాశంగా మలుచుకుంటున్న హాస్టళ్ల నిర్వాహకులు వారినుంచి అందినకాడికి దండుకుంటున్నారు.

● నిబంధనలు ఇలా..

ప్రైవేటు హాస్టల్ ప్రారంభించేవారు విధిగా సంబంధిత స్థానికసంస్థల నుంచి ముందస్తు అనుమతులు పొందాలనే నిబంధన ఉంది. మున్సిపాలిటీల పరిధిలో ఉన్న హాస్టళ్లకు మున్సిపల్ అధికారులు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు అనుమతి పత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. స్థానికసంస్థలు జారీచేసే అనుమతులు ఉంటేనే హాస్టళ్లు నిర్వహించాలనే నిబంధన ఉంది. హాస్టళ్లలో శానిటేషన్, వెంటిలేషన్, తాగునీరు, టాయ్‌లెట్ల పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించే అధికారం కూడా స్థానికసంస్థల అధికారులకు ఉంటుంది. విద్యాసంస్థలు ప్రారంభించే ముందు ఆయా స్థానిక సంస్థల..

మిగతా 7లో..

రోస్టర్ విధానంతో మాలలకు తీరని అన్యాయం

● జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

లక్షెట్టిపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఏకపక్ష రోస్టర్ విధానంలో మాలలకు తీరని అన్యాయం జరుగుతుందని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో జరిగిన మాల మహానాడు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకణ రోస్టర్ జీవో 99వలన మాలజాతి నిర్వీర్యం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నీట్‌లో పదోన్నతులు, మెడికల్ సీట్లు, ఇంజనీరింగ్‌లో రోస్టర్ విధానాన్ని ఆపేసి జీవో 99ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. దీని వలన విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. రోస్టర్ విధానంపై సీఎం రేవంత్ రెడ్డి పునరాలోచన చేయాలని లేదంటే ఆగస్టు నెలలో చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తొగరు సుధాకర్, పాల్తెపు శంకర్, పలిగిరి కనకరాజు, బందెల బెంజిమెన్, జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నక్క శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గరిసె రవీందర్, పొల్లు శ్రీనివాస్, బొల్లం రాంకుమార్, ఉసిల్ల విజయ్, దాసరి రాములు, బండ రవి, చంద్రయ్య, ప్రేంసాగర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

కోటపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు ప్రతీఒక్కరు దూరంగా ఉండాలని మోడల్ స్కూల్ విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రజ్వల కార్యక్రమంలో భాగంగా స్కూల్ చాలెంజ్ థీమ్ సందర్భంగా వరల్డ్ నో టొబాకో ర్యాలీ చేపట్టారు. విద్యార్థి దశ నుంచే పొగాకు వ్యతిరేకతపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో మహిళ ఉపాధ్యాయులు లిల్లిజోయెల్, అనూష, గీత, హరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

● పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పొగాకు ఉత్పత్తులు, ధూమపానానికి దూరంగా ఉండాలని దేవులవాడ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. పొగాకు వ్యతిరేక నినాదాలతో ర్యాలీ, వ్యాసరచన పోస్టర్లను తయారు చేయడం, ఉపన్యాసం వంటి కార్యక్రమాలను విద్యార్థులకు నిర్వహించారు. వీటి వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులు నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : 2025-26 విద్యా సంవత్సరానికి గాను హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస్)లో మొదటి తరగతిలో ప్రవేశం కోసం షెడ్యూల్డు కులాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. హైద్రాబాద్ పబ్లిక్ స్కూల్-బేగంపేట నందు జిల్లాకు రెండు సీట్లు కేటాయించారన్నారు. అభ్యర్థులు జిల్లా వాసులై జూన్ 1, 2018, మే 31, 2019 మధ్య జన్మించి ఉండాలని, జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా విద్యార్థి పేరిట జారీ చేసినదై ఉండాలని తెలిపారు. ఆగస్టు 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు సమర్పించాలని, ఆగస్టు 10వ తేదీన నియామక కమిటీని ద్వారా లాటరీ పద్ధతిన అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు రాష్ట్రస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర యువ కబడ్డీ చాంపియన్‌షిప్ కోసం శనివారం శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ బాధ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికయ్యే ప్రాబబుల్స్ జట్టు క్రీడాకారులు ఆదివారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే యువ తెలంగాణ ప్రీమియర్ లీగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు ఫొటోలు, రిజిస్ట్రేషన్ కోసం 100 రూపాయలతో అసోసియేషన్ ఈసీ మెంబర్ కార్తీక్‌ను కలవాలని సూచించారు.

పౌరహక్కులకు భంగం కలిగితే అధికారులను ఆశ్రయించాలి



దేవాపూర్ పౌరహక్కుల సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

కాసిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కులకు భంగం వాటిల్లితే ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆశ్రయించాలని అదనపు కలెక్టర్ చంద్రయ్య సూచించారు. గురువారం దేవాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో జరిగిన పౌరహక్కుల దినోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా జీవించే హక్కును కల్పించిందన్నారు. వీటిలో ఎవరికైనా భంగం వాటిల్లినప్పుడు అధికారులను ఆశ్రయిస్తే న్యాయం పొందే హక్కులు కల్పించబడ్డాయన్నారు. ఎస్సీ, ఎస్టీలను అంటరానివారిగా పరిగణించి అవమానిస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లల వెంకటేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గప్రసాద్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ భోజన్న, దేవాపూర్ ఎస్సై గంగారాం, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, ఎంపీవో శేఖ్ సఫ్దర్ అలీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు రామిల్ల కిష్టయ్య, ఎస్టీ సెల్ నాయకులు కొమ్ముల బాపు, కనకరాజు, మాడవి వెంకటేష్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సివిల్ రైట్స్‌డేను గురువారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ సమక్షంలో వివిధ శాఖల అదికారులు పాల్గొని గ్రామంలోని ప్రజల సమక్షంలో పలు అంశాలను చర్చించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

వేమనపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీల్వాయి, వేమనపల్లి రైతు వేదికల్లో గురువారం తహసీల్దార్ సంధ్యారాణి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలానికి నూతనంగా 713 రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్ ఆలీ, యువజన అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచులు రాంచందర్, మధుకర్‌గౌడ్, మాజీ ఎంపీపీలు లింగగౌడ్, వెంకటేశం పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : రేషన్ కార్డులు అందించి ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతనందిస్తుందని మండల కాంగ్రెస్ ఇన్‌చార్జీ కడారీ జీవన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం అందుగులపేట గ్రామంలో నూతన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్కరికి కూడా రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6.61 లక్షల రేషన్‌కార్డులను అందించనుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరేందర్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, కారోబార్ మధుకర్, రేషన్ డీలర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ వర్కర్లకు వేతనాలు చెల్లించండి

నస్పూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ హాస్టల్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్లకు ఎనిమిది నెలలుగా వేతనాలు అందడంలేదని, వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బీసీ వెల్ఫేర్ డీడీ పురుషోత్తంకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ గత ఏడాది నవంబరు నుంచి 2025 జూలై వరకు వేతనాలు రాలేదన్నారు. నెల నెల వేతనాలు రాకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. అంతే కాకుండా సిబ్బంది కొరత కారణంగా వర్కర్లపై అధిక పనిభారం పడుతోందన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షకార్యదర్శులు మెమర్ బాబా, శ్రీవిద్య, వర్కర్లు వరలక్ష్మి, మనీషా, సత్తమ్మ, పద్మ, జ్యోతి, స్వప్న, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

● మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి,జూలై31(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం పట్టణంలో నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను, 420 హామీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఏడాదిన్నర కాలంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్నివర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు.

విద్యార్థులకు ఆసక్తి పెంపొందించేలా పాఠాలు బోధించాలి



దండేపల్లిలో శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య

దండేపల్లి జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల స్థాయికి అనుగుణంగా వారిలో ఆసక్తి పెంపొందించేలా పాఠాలు బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య అన్నారు. దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని దండేపల్లి, లక్షెట్టిపేట, జన్నారం మండలాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు మరింత మెరుగుపరిచి విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం లర్నింగ్ అవుట్ కమ్స్‌పై చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నరేందుల శ్రీనివాస్, ఆర్‌పీలు అప్పాల మనోహర్, పాత రమేష్, మూడు మండలాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వన మహోత్సవం లక్ష్యాలను సాధించాలి

● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్ర మంలో జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను సాధిం చాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. గురువారం చెన్నూరు మండలంలోని కిష్టంపేట గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గీతకార్మికుల సంక్షేమంలో భాగంగా 400తాటి మొక్కలు నాటడంతో పాటు గీత కార్మికులకు మొక్కలు పంపిణీ చేశామన్నారు. ప్రతీఒక్కరు మొక్కలునాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రజలు తమఇళ్లలో మొక్కలు నాటాల న్నారు. అనంతరం పొక్కూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 200మొక్కలు నాటారు. పాఠశాల పరిధిలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం వంటశాలను, ఆహారనాణ్యతను, హాజరుపట్టిక, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. పల్లె దవాఖాన, ఆయుష్‌భారత్ ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి మందుల నిల్వలు, రిజిస్టర్‌లు, పరిసరాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం అంగ్రాజ్‌పల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని, సమయానుసారంగా చేసుకోవాల్సిన పరీక్షలు, తీసుకోవాల్సిన మందులపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పిల్లల వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయని, వ్యాక్సిన్‌ల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లనవసరం లేదని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. చెన్నూరులోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిష్టర్‌లు, రికార్డులను పరిశీలించారు. చెన్నూరు మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0పథకం పనులను పరిశీలించి పనులను వేగవం తం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, ఎంపీడీవో మోహన్, తహసీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



కిష్టంపేటలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బడిబ్యాగు మోయలేని భారం

- బ్యాగుల అధిక బరువుతో పిల్లల ఆరోగ్యంపై ప్రభావం
- చదువుతోనే సరి.. ఆటలకు చోటేది

7

అడుగుకో గుంత..

- అధ్వానంగా ఇందాని రోడ్డు
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు

6

గుంతలమయంగా రోడ్డు..



మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి మామిడిగూడ వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మందమర్రి నుంచి మండల కేంద్రానికి వచ్చే రహదారికి కాసిపేట సమీపంలోని రోడ్డుపై వర్షపు నీరు నిలిచి భారీగుంతలు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదవశాత్తు గుంతలో పడిపోవడంతో గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు. - కాసిపేట

మైదానంలో పెరిగిన పాముల సంచారం

మందమర్రిటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో పిచ్చిమొక్కలు పెరిగి, చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాముల సంచారం పెరిగింది. దీంతో ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే వాకర్లు, చిన్నపిల్లలను తీసుకువచ్చే వారు భయపడుతున్నారు. చిన్నారుల ప్లేగ్రౌండ్ వద్ద పెద్దపెద్ద పిచ్చి మొక్కలు, గడ్డి పెరగడంతో తల్లిదండ్రులు భయపడుతున్నారు. అలాగే బాస్కెట్‌బాల్ కోర్టు చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో అందులోనుంచి పాములు ఎక్కడ వస్తాయోనని క్రీడాకారులు భయపడుతున్నారు. సింగరేణి యాజమాన్యం నూతన వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో చెత్త పేరుకుపోయింది. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించాలని కోరుతున్నారు.



పరవళ్లు తొక్కుతున్న గోదావరి



ఎగువ ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద నీరు రావడంతో ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. దీంతో నీటిని గోదావరి నదిలోకి వదులుతున్నారు. గోదావరి నదిలో రోజురోజుకు నీటి మట్టం పెరుగుతోంది. మంచిర్యాల-జగిత్యాల జిల్లాల సరిహద్దులో గల దండేపల్లి మండలం గూడెం-రాయపట్నం లోలెవల్ వంతెనపై గురువారం వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. గూడెం లోలెవల్ వంతెనకు సమాంతరంగా నీరు ప్రవహిస్తోంది. దీనికితోడు ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ రావడంతో గూడెం గోదావరి నది వంతెన నీటితో నిండుకుండలా కనిపిస్తోంది. - దండేపల్లి